

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణం

ప్రజాశక్తి - రావులపాలెం
అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. మండల పరిధి పొడగట్లపల్లి నవజీవననగర్ లో సుమారుగా 10 సంవత్సరాల క్రితం అంగన్‌వాడీ భవనం నిర్మాణం చేపట్టారు. అయితే అది అసంపూర్తిగా నిలిచి పోయింది. అప్పటినుండి భవనాన్ని పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించుకున్నా ప్రయోజనం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఎవ్వరూ దీనిని పట్టించుకొన్న దాఖలాలు కూడా లేవని గ్రామస్తులు వాపోతున్నారు.ఇది నిర్మాణం జరుగకపోతే శిథిలావస్థకు చేరుకుని పాడయ్యే పరిస్థితి నెలకుంటుందని ప్రజాప్రతినిధులు, అధికారులు భవనాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.


నవజీవననగర్‌లో అంగన్‌వాడీ భవనం

ఆపద్బాంధవికే ఆపద..!

- కుయ్యో మొర్రో అంటున్న 108 వాహనాలు
- తరచూ మరమ్మతులు గురవుతున్న వైనం
- పట్టించుకోని ప్రభుత్వం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి
ఎవరికైనా ఆపదొస్తే నిముషాల వ్యవధిలోనే క్షతగాత్రులను దగ్గర్లో ఉన్న ఆసుపత్రులకు తరలిస్తున్న 108 వాహనాలు అరకొర సేవలకే పరిమితం అవుతున్నాయి. సకాలంలో ఆసుపత్రులకు చేరలనుకుంటున్న సామాన్యులకు ఈ వాహనాల ద్వారా చుక్కలు కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వం హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి 108 సేవలు గురయ్యాయని పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఆ సేవల్లో కూటమి ప్రభుత్వ పాలనలోనైనా మార్పు వస్తుందని అందరూ భావించారు. అయితే నాలుగు నెలలు గడిచినప్పటికీ నిర్వహణ సంస్థ నిర్లక్ష్యం వలన ఈ వాహనాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం పలు వాహనాలు మేజర్, మైనర్ మరమ్మతులకు గురై ముక్కుతూ మూలుగుతూ ముందుకు వెళ్తున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో సిబ్బంది వీటిని నడిపిస్తున్న దుస్థితి ఏర్పడింది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 68 వాహనాలు పని చేస్తున్నాయి. వీటిలో 50 వాహనాలు కొత్తవి కాగా మిగిలినవి పాతవి కావడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రమాదం బారినపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న క్షతగాత్రులను, అనారోగ్యానికి గురై ఆపదలో ఉన్నవారిని తక్షణమే ఆసుపత్రులకు తరలించే 108 వాహనాలు అస్తమానూ మరమ్మతులకు గురవుతున్నాయి. వాహనాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రస్తుతం అంబులెన్సులు వివిధ మరమ్మతులకు గురై ఆపసోపాలు పడుతున్నాయి. బాధితులను అత్యవసరంగా తరలించే సమయంలో మార్గ మధ్యంలో నిలిచిపోతున్నాయి. సిబ్బంది సమన్వయంతో మరో వాహనం నుంచి బాధితులను ఆసుపత్రులకు తరలిస్తున్నారు. పాతవి కావడంతో ఎప్పుడు.. ఎక్కడ ఏ సమయంలో ఆగిపోతాయో తెలియక సిబ్బంది పడుతున్న ఇబ్బందులు ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.

తరచూ సమస్యలే

ప్రస్తుతం ఉన్న వాహనాల్లో సగం తరచూ వివిధ మరమ్మతులకు గురౌతున్నాయి. ప్రధానంగా మేజర్ మరమ్మతుల్లో కాకినాడ జిల్లాలో జగ్గంపేట, సర్పవరం, పిఠాపురం, గొల్లప్రోలు, జగన్నాధపురం అర్బన్ 2, యు.కొత్తపల్లి వాహనాలు ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లాలో సీతానగరం, అనపర్తి, కడియం, తాళ్ళపూడి, ఉండ్రాజవరం, గోకవరం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సఖినేటి పల్లి, అయినవిల్లి, ఆలమూరు, రామచంద్రాపురం, పి.గన్నవరం, ఐ.పోలవరం, ముమ్మిడివరం, రాయవరం వాహనాలు ఉన్నాయి. ఈ మండలాల్లో వాహనాలు ఎప్పుడు రిపేర్లు వస్తాయో తెలియడం లేదని సిబ్బంది వాపోతున్నారు. జిల్లాలో రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వెళ్లే జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగు తున్నాయి. వాహనాలు మరమ్మతులకు గురైతే రోజుల తరబడి బాగు కావడం లేదు. పక్క మండలం నుంచి వాహనం వచ్చే వరకూ క్షతగాత్రులు ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది. చాలా వాహనాల్లో ఇఎంటీలుగా మహిళలు పని చేస్తున్నారు. అర్ధరాత్రి సమయాల్లో వాహనాలు రిపేర్లు వస్తే కనీసం బాగు చేసుకునేందుకు అవకాశం ఉండడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్యాలను నిర్దేశిస్తున్న యాజమాన్యం

రోజుకి 4, నెలకు 120 కేసులకు తప్పనిసరిగా హాజరుకావాలని నిర్వహణ సంస్థ సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశించి వేధింపులకు గురిచేస్తుందని సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఒకవేళ టార్గెట్ చేరుకోకపోతే వేధింపులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేదేమీ లేక సిబ్బంది కేసుల టార్గెట్ కోసం పడరాని పాట్లు పడుతున్నారు. మార్గం మధ్యలో వాహనాలు మరమ్మతులకు గురైతే డ్రైవర్ పనిచేయించుకోవాలని ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

2 నెలలుగా అందని జీతాలు

వాహనాల్లో పనిచేస్తున్న సిబ్బందికి రెండు నెలలుగా వేతనాలు అందడం లేదు. జిల్లావ్యాప్తంగా 350 మంది పైలెట్లు, ఇఎంటీలు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరందరికి సుమారు రూ.1.40 కోట్లు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో సిబ్బంది అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి ఏర్పడింది. దసరా పండగ సంతోషం కూడా ఆవిరి అయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే దీపావళి పండుగకైనా జీతాలు విడుదల చేయాలని కోరుతున్నారు.

భారీ వర్షాలతో ప్రజలకు అవస్థ

ప్రజాశక్తి - రామచంద్రపురం
కొద్ది రోజులగా కురుస్తున్న భారీ వర్షాలు ఆదివారం కొనసాగాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఒకవైపు జనజీవనం స్తంభించిపోయింది. దీంతో వ్యాపార సంస్థలు మూతపడుతున్నాయి. ఇక అల్పపీడనాలు వరుస తుపానులతో తొలకరి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం తొలకరి వరి చేలు ఈనిక దశ నుండి గింజ పాలు పోసుకునే దశకు చేరుకున్నాయి. మరో రెండు మూడు వారాల్లో పంట చేతికి వస్తుందని ఆశించిన రైతులు భారీ వర్షాలతో ఆందోళనకు గురవుతున్నారు. ఎప్పటికీ అక్కడక్కడ నేల వాలిన వరి చేలపై ఎడ తెగని వర్షాలకు మరింత నష్టం వాటిల్లుతుందని రైతన్నలు కలవర పడుతున్నారు. ఈనెల 22 నుండి మరో తుపాను వాయుగుండం సంభవించే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ప్రస్తుతం వరి పంట పండించడానికి అధిక పెట్టుబడులు పెరిగిన ధరలతో రైతన్నలకు ఖర్చుల భారంగా మారాయి. కోతల దశలోనూ మూర్పేళ్ల దశలోనూ ధాన్యం ఆరబెట్టుకునే సమయంలోను వర్షాలు కురిస్తే ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందకుండా పోతుంది దీంతో విపరీతమైన నష్టాలు రైతులు చవిచూస్తారు.


ఆదివారం కురిసిన భారీ వర్షాని నిర్మానుష్యమైన రోడ్డు

టిడిపి ఎంఎల్‌సి అభ్యర్థిగా పేరాబత్తుల

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, ఐ.పోలవరం
ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థిగా పేరాబత్తుల రాఖశేఖర్‌ను టిడిపి అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేరాబత్తుల రాజశేఖర్ టిడిపిలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేశారు. గతంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జడ్‌పిటిసి సభ్యునిగా పనిచేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపిని అంటిపెట్టుకుని ఉన్నారు. ఎన్నికలకు ముందు ఆ పార్టీ అధినేత చంద్రబాబుకు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో కాకినాడ రూరల్ నుంచి టిడిపి టిక్కెట్‌ను ఆశించారు. అయితే పొత్తులో భాగంగా అది జనసేనకు కేటాయించడంతో రాజశేఖర్‌కు టికెట్టు దక్కలేదు. ఇటీవల తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మంత్రులు, ఎంఎల్‌ఎలు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పేరాబత్తుల పేరును ప్రతిపాదించినట్టు సమాచారం. ఆ నివేదిక మేరకే అధిష్టానం రాజశేఖర్‌ను బరిలోకి దింపింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్ ఎంపికపై ముమ్మిడివరం ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు, మండల పార్టీ అధ్యక్ష్యులు రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, పలువు నాయకులు, అభిమానులు ,స్నేహితులు, హర్షం వ్యక్తం చేశారు.


సిఎం చంద్రబాబు, ఎంఎల్ఎ సుబ్బరాజుతో ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్

మామిడికుదరు మెజీషియన్‌కి నేషనల్ అవార్డు

ప్రజాశక్తి - మామిడికుదురు
మామిడికుదురు కి చెందిన మెజీషియన్ ఆలీకి అక్టోబర్ 20న కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో మలయాళీ మెజీషియన్ అసోసియేషన్ నిర్వహించిన నేషనల్ లెవెల్ మ్యాజిక్ ఫెస్టివల్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నేషనల్ లెవెల్ అవార్డుతో పాటు రూ.లక్ష నగదు బహుమతిని కూడా గెలుచుకున్నారు. దేశంలోని ముగ్గురిని ఎంపిక చేయగా కలకత్తాకు చెందిన రంజిత్, కర్ణాటక రాష్ట్రానికి చెందిన సీనియర్ శంకర్, తెలుగు రాష్ట్రాల నుంచి అలీని ఈ అవార్డుకు ఎంపిక చేయడం విశేషం. 36 సంవత్సరాల నుంచి మ్యాజిక్ రంగానికి సేవలు చేస్తూ దేశంలోని అన్ని రాష్ట్రాలలో ప్రదర్శనలు చేస్తూ పలు దేశాల్లో 7వేల ప్రదర్శనలు చేసినందుకుగాను ఈ అవార్డుకు ఎంపిక చేస్తున్నట్టు మలయాళీ మెజీషియన్స్ అసోసియేషన్ నిర్వాహకులు తెలియజేశారు కాగా గతంలో కూడా అలి నేషనల్ ఇంటర్నేషనల్ అవార్డ్స్ కూడా గెలుచుకున్నారు ముఖ్యంగా ఏడు దేశాల కలయికలో జరిగిన సార్క్ మేజిక్ కాంపిటీషన్లో పాల్గొని ప్రథమ బహుమతి కూడా సాధించారు. అలి ఈ అవార్డుతో పాటు రూ.లక్ష నగదు బహుమతి గెలుచుకోవడం పట్ల రెండు రాష్ట్రాల తెలుగు మెజీషియన్స్, జిల్లా ప్రజలు అలీని అభినందించారు.



నేషనల్ అవార్డు, రూ.లక్ష నగదు బహుమతితో మెజీషియన్ అలీ

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - యంత్రాంగం
ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

రామచంద్రపురం: రానున్న ఐదేళ్లలో రాష్ట్రాన్ని అబివృద్ధి చేసి స్వర్ణాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం ఆయన రామచంద్రపురం నియోజకవర్గంలో రామచంద్రపురం, కె.గంగవరం మండలాలలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించారు. పలు అభివద్ధికార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. మండలంలోని వెలంపాలెం గ్రామంలో రూ.23 లక్షల ఉపాధి హామీ నిధులతో సిసి రోడ్లు, ద్రాక్షారామలోని నున్న వారి వీధిలో రూ.3లక్షల50 వేలతో సిసి రోడ్డు, కె. గంగవరం మండలం బాలాంత్రం గ్రామంలో రూ.31 లక్షలతో సిసి రోడ్డు నిర్మించేందుకు భూమి పూజ నిర్వహించారు. రామచంద్రపురం నియోజకవర్గంలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను త్వరలోనే పునర్నిర్మిస్తామన్నారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో సుమారు రూ.6 కోట్ల70లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. వేలం పాలెం గ్రామంలో రూ.17 లక్షల సిఎండిఎఫ్, జడ్‌పిజిఎఫ్ నిధులతో నిర్మించిన గ్రామీణ నీటి సరఫరా ఉప కార్యనిర్వహక ఇంజనీర్ కార్యాలయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రారంభించారు. కార్యక్రమాల్లో రామచంద్రపురం, కె. గంగవరం ఎంపిడిఒలు పద్మజ్యోతి, శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఎఇ యేసు రత్నం, వేలంపాలెం, ద్రాక్షారామం బాలాంత్రం సర్పంచ్‌లు టేకుమూడి సునీత, కొత్తపల్లి అరుణ, శివరాం, ప్రజా ప్రతినిధులు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాలలో భాగంగా కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ లు పలు నియోజకవర్గంలో అభివద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. తొలుత కొత్తపేట మండలంలోని ఖండ్రిగ గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించినున్న సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మార్గం గంగాధర్ రావు , సర్పంచ్ టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసరావు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు ధర్నాల రామకష్ణ, రెడ్డి రామకష్ణ ఎంపిటిసి సభ్యుడు రెడ్డి శ్రీనివాస్, యల్లమిల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు

ఆలమూరు: దేశ పురోగతి సాధించడానికి గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ, అహర్నిశలు కృషి చేస్తోందని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని పెనికేరు, గుమ్మిలేరు, పెదపల్ల, పినపల్ల, సందిపూడి, ఆలమూరులలో పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాలలో భాగంగా రూ.1.32 కోట్లతో అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి బండారు శ్రీనివాసరావుతో కలిసి భూమి పూజ చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడికుదురు: గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజాన్ని నేడు కూటమి ప్రభుత్వం నెరవేర్చబోతోందని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలలో భాగంగా మామిడికుదురు మండలంలో మామిడికుదురు, గెద్దాడ, కొమరాడ, గోగన్నమఠం, కరవాక తదితర గ్రామాల్లో సిసి రోడ్లుకు నిర్మాణ పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి మార్క్ ఫెడ్ డైరక్టర్ గుండుబోగుల పెదకాపు, నామన రాంబాబు, మొల్లేటి శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ఆదివారం అమలాపురం మండలం గున్నేపల్లి అగ్రహారం గ్రామం లో సర్పంచ్ పెద్దిరెడ్డి రాము అధ్యక్షతన పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మల్లుల పోలయ్య, రాష్ట్ర ఎస్‌సి సెల్ నాయకులు పాలమూరి ధర్మపాల్, ఉప సర్పంచ్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, వార్డు మెంబర్లు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. పేరూరు, ఇందుపల్లి, సమనస, సాకుర్రు, సవరపాలెం గ్రామాలలో ఎంఎల్ఎ ఆనందరావు రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు తో కలిసి ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో శంకుస్థా పనలు చేశారు. ఆయా గ్రామాలలో ఉపాధి హామీ నిధులు రూ.కోటి12 లక్షలతో నిర్మించే 10 రకాల పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి సుభాష్



గోగన్నమఠంలో రోడ్డు నిర్మాణాని భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ దేవ వరప్రసాద్


పెనికేరులో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంఎల్ఎ సత్యానందరావు


గున్నేపల్లి అగ్రహారంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ ఆనందరావు

నేటి నుంచి వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం
వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 12వ వార్షిక బ్రహోత్సవాలను సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అధ్యక్షతన బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమక్షించి ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 21 నుంచి 29వ తేదీ వరకు వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం ఖండ వల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపం డితులు బ్రహ్మోత్సవ క్రతువు నిర్వహిం చనున్నారు. 21న ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభ మవుతాయి. రాత్రి పరావాసుదేవ అలంక రణతో శేషవాహన సేవ, 22న ఉదయం అష్టదళ పాదపద్మారాధన, రాత్రి సరస్వతి అలంకరణతో హంస వాహనసేవ, 23న అష్టోత్తర శతకలశాభిషేకం, వేంకటేశ్వర హోమం, కోదండ రామఅలంకరణతో హనుమద్ వాహనసేవ, 24న తిరుప్పావడ సేవ యోగనారసింహ అలంకరణతో సింహవాహన సేవ, 25న గోదావరి నదీ జలసంగ్రహణం, మహాలక్ష్మి హోమం, రాత్రి మలయప్ప స్వామి అలంకరణతో గరుడవాహన సేవ, 26న మహాపుష్పయాగం, శ్రీకృష్ణ అలంకరణతో సూర్యప్రభవాహనసేవ, సహస్ర దీపాలంకరణ సేవ, మోహిని అలంకరణతో చంద్రప్రభ వాహనసేవ, 27న ఉదయం శ్రీనివాస కల్యాణం, రాత్రి రాజాధిరాజ అలంకరణతో గజ వాహనసేవ, 28న తోమాలసేవ, మహా సుదర్శన హోమం, కల్పవక్ష వాహన సేవ, చూర్ణోత్సవం, కల్కి అలంకరణతో అశ్వ వాహనసేవ, 29న మహాపూర్ణాహుతి, చక్రస్నానం, ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలకు వచ్చే యాత్రికులకు ఇటువంటి ఇబ్బందులు తలెత్త కుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ డిసి నల్ల చక్రధరరావు తెలిపారు.



విద్యుత్ దీపాలంకరణలో వెంకన్న ఆలయం

'ఉచిత బస్సు హామీ' పై పోస్ట్ కార్డు ఉద్యమం

ప్రజాశక్తి - మామిడికుదురు
కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు హామీ నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమం చేపట్టింది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిళా రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆదివారం నగరం నుంచి పాశర్లపూడి వరకు బస్సు లో ప్రయాణం చేశారు డిసిసి అధ్యక్షులు చిట్టిబాబు బస్సులో ప్రయాణికులతో ముఖ్యమంత్రికి ఉచిత బస్సు హామీని నెరవేర్చాలని కోరుతూ పోస్టుకార్డులు రాయించారు. ఈ కార్యక్రమంలో మాచవరపు శివ న్నారాయణ, వంటెద్దు బాబి, మహమ్మద్ అరిఫ్, బొంతు రాజేంద్రప్రసాద్, నేతల నాగరాజు, కుడిపూడి శ్రీనివాస్,అప్పన శ్రీరామ కృష్ణ,గెడ్డం వెంకటేశ్వరరావు, మొల్లేటి వెంకటేశ్వరరావు, మట్టా సునీల్, కొండేటి వెంకటేశ్వరరావు, స్టాలిన్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు


పోస్టు కార్డు ఉద్యమం చేపట్టిన డిసిసి అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు

కార్టూ'నిజం'



అక్రమ ఆక్వా చెరువులపై మంత్రి వివరణ ఇవ్వాలి

పిల్లి సూర్యప్రకాష్ డిమాండ్

ప్రజాశక్తి - రామచంద్రపురం
అక్రమ ఆక్వా చెరువులపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి చేసిన వ్యాఖ్యలకు వైసిపి ఇన్చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ వివరణ కోరారు. ఆదివారం సూర్యప్రకాష్ విలేకరులతో మాట్లాడుతూ శనివారం మంత్రి సుభాష్ ఒక వీడియో రిలీజ్ చేశారన్నారు. రామచంద్రపురం నియోజవర్గంలో అనుమతి లేని ఆక్వా చెరువులు సాగు చేస్తూ, అక్రమ రొయ్యల చెరువుల ఆక్వా రైతులు గత వైసిపి ప్రభుత్వంలోపెద్దలందరికీ ముడుపులు చెల్లించారనీ, అదే విధంగా కూటమి ప్రభుత్వం లో మాకు కూడా ముడుపులు చెల్లించండి అని మేము దానికి కొంత అమౌంట్ వేసి అభివద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆ వీడియోలో మంత్రి సుభాష్ పేర్కొన్నట్లు సూర్యప్రకాష్ వివరించారు. దీనిపై మంత్రి ప్రజలందరికీ కూడా స్పష్టత ఇవ్వాలి, ఆక్వా రైతులు ముడుపులు ప్రభుత్వానికి చెల్లించాలా లేదా మంత్రికి చెల్లించాలా? ప్రభుత్వానికి చెల్లించాల్సింది అయితే ఎవరికి చెల్లించాలి? లేదా మీకే చెల్లించాలా అని స్పష్టత ఇవ్వాలని సూర్య ప్రకాష్ కోరారు. గడిచిన ఐదేళ్లలో రామచంద్రపురం నియోజవర్గంలో మీరు అక్రమంగా రొయ్యలు సాగు చేసుకోండి అని బహిరంగంగా వైసిపి కానీ అప్పటి ప్రభుత్వంలో పెద్దలు గాని ఎక్కడ కూడా ప్రకటించిన సందర్భాలు లేవన్నారు. ఒకవేళ అటువంటివి ఏమైనా ఉంటే బయట పెట్టండి అని మంత్రి సుభాష్‌ను పిల్లి సూర్య ప్రకాష్ కోరారు. వైసిపి ఎప్పుడు అక్రమ రొయ్యల చెరువులను తొలగించాలని డిమాండ్ చేసిందని, ఇప్పుడు కూడా డిమాండ్ చేస్తున్నామన్నారు. అక్రమంగా సాగు చేస్తున్న రొయ్యల చెరువులను తక్షణమే తొలగించాలని అక్రమ వ్యాపారాలు మానుకోవాలని సూర్యప్రకాష్ విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నెల రోజుల క్రితం కె. గంగవరం మండలం కోట గ్రామంలోఉన్న అక్రమ రొయ్యలు చెరువులు తొలగించమని ఆ గ్రామ పెద్దలు, మహిళలు రోడ్డుమీద ధర్నా చేశారని, ఆ ధర్నాలో మేము కూడా పాల్గొన్నామన్నారు. తక్షణమే రొయ్యల చెరువులు తొలగించాలని సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - అయినవిల్లి
అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్న దానానికి దాత విరాళం అందజేశారు. ఆదివారం కాకినాడకు చెందిన పసుపులేటి శ్రీనివాస్, శుభ వైష్ణవి లక్ష్మి దంపతులు విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించికుని ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం నిత్యాన్నదాన నిధికి రూ.10116 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఇఒ సతీష్ రాజు తెలిపారు వీరికి ఆలయ అర్చకులు స్వామి వారి చిత్రపటం అందజేశారు.


దాతలకు చిత్రపటం అందిస్తున్న అర్చకులు

నేడు యథావిధిగా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి - అమలాపురం
జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నేడు సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా అమలాపురం కలెక్టరేట్ లోని గోదావరి భవన్లో యథావిధిగా నిర్వహిస్తారని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్ మండల స్థాయిలో కూడా ఈకార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలన్నారు.

బాధితులకు మంత్రి సుభాష్ సాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం
బాధిత కుటుంబాలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.10 వేలు సాయం అందజేశారు. కె.గంగవరం మండలం బాలాంత్రం గ్రామంలో పత్తి వెంకటరమణ అనే వ్యక్తి పక్షవాతంతో అనారోగ్యానికి గురయ్యారు. అతనికి మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.5 వేలు, గ్రామానికి చెందిన మల్లిపూడి బుజ్జి రూ.5వేలు మొత్తం రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం
మండపేట టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఐదు ఆటో యూనియన్‌లకు చెందిన ఆటో డ్రైవరులతో మండపేట రూరల్ సిఐ పి.దొర రాజు, మండపేట టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి ఆదివారం రోడ్డు భద్రత పై అవగాహనా సదస్సు నిర్వహించారు. సిఐ దొరరాజు మాట్లాడుతూ రహదారి భద్రత పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సదస్సుకు ఆటో యూనియన్ల నాయకులు, డ్రైవర్లు హాజరయ్యారు.

నేరాలు ఘోరాలు



అసలేం జరిగింది?

మహిళ మృతిపై పలు అనుమానాలు

ప్రజాశక్తి - కడియం

నర్సరీలో పనిస్తూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మహిళా కూలీ ఉదంతం మిస్టరీగా మారింది. ఒడిశాలోని పర్లాకిమిడి ప్రాంతానికి చెందిన రౌతు పాపారావు, రౌతు కస్తూరి భార్యాభర్తలు. వారికి కుమార్తె, వికలాంగుడైన కుమారుడు ఉన్నారు. ఉపాధి నిమిత్తం పాపారావు తన తల్లితో పాటూ కుటుంబంతో కలిసి 20 ఏళ్ల క్రితం కడియపులంకు వలస వచ్చారు. అప్పటి నుంచి ఇక్కడే ఉంటూ నర్సరీల్లో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఎప్పటి లాటే ఈ నెల 15న కస్తూరి నర్సరీలో కూలి పనికి వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు నర్సరీలు, చుట్టుపక్క ప్రాంతాలను జల్లెడ పట్టారు. అయినప్పటికీ ఆమె అచూకీ దొరకలేదు. దీంతో ఈ నెల 16న భర్త పాపారావు కడియం పోలీసులకు ఫిర్యాద చేశారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ నెల 17న గోదావరి తూర్పు డెల్టా ప్రధాన పంట కాలువలో ఆలమూరు మండలం చొప్పెళ్ల లాకుల వద్ద ఆమె శవమై తేలింది. కుటుంబ సభ్యులు, పోలీసులు దీన్ని నిర్ధారించారు. అదే రోజు సాయంత్రం పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. 18వ తేదీ సాయంత్రం పోస్టుమార్టం అనంతరం ధవళేశ్వరంలోని శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు. ఆమె మరణంపై కుటుంబ సభ్యులు, స్థానికులు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు గాని, ఆత్మస్థయిర్యాన్ని కోల్పోయే మనస్తత్వం కస్తూరిది కాదని వారు అంటున్నారు. ఎవరైనా అత్యాచారం చేసి హత్య చేసుంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతదేహంపై దుస్తులు కూడా లేకపోవడం వారి అనుమానాలకు బలం చేకూరుతున్నాయి. ప్రాంతం కాని ప్రాంతానికి వచ్చిన తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - గండేపల్లి

జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గండేపల్లి గ్రామానికి చెందిన కజులూరి రమణ (60) రోడ్డు దాటి సమయంలో రాజమహేంద్రవైపు నుంచి జగ్గంపేట వైపు వెళ్లే మినీ వ్యాన్ ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసకున్న స్థానిక ఎస్ఐ శివనాగు సంఘటన స్థలానికి వచ్చి ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు తెలిపారు.



జాతీయ రహదారి చెంతనే ఉన్న మార్కెట్

ప్రమాదపు అంచున మల్లేపల్లి మార్కెట్

ప్రజాశక్తి- గండేపల్లి

ఏ సమయంలో ఏ ఘోర ప్రమాదం జరుగుతుందో అనే విధంగా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో మార్కెట్ వద్ద ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి మంగళవారం మల్లేపల్లి మార్కెట్ పంచాయతీ ఆవరణలో ఉండగా, అక్కడికి నాలుగైదు గ్రామాల నుంచి కూరగాయలు కొనుగోలు చేసేందుకు ప్రజలు వస్తారు. అయితే ఈ మార్కెట్ జాతీయ రహదారిని ఆనుకొని ఉండటం వల్ల, వాహనాలు రోడ్డుపైనే పెడతారు. మరొకపక్క నడిచి వచ్చేవారు రోడ్డు దాటే సమయం. అదే సమయానికి, పాఠశాల నుండి వచ్చే విద్యార్థులు రోడ్డు దాటే క్రమంలో జాతీయ రహదారిపై వాహనాలు అతి వేగంగా వెళుతుంటాయి. ఈ సమయంలో అనేకసార్లు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, దృష్టి సారించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేస్తే మంగళవారం ఒక కానిస్టేబుల్ నియమించే వారని ప్రస్తుతం అది లేకపోవడం వల్ల రోడ్డు దాటే సమయంలో వద్ధులు, పిల్లలు వికలాంగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.



ఒమ్మంగి రహదారిలో వర్షపునీటితో నిండిన గుంతలు

చెరువును తలపిస్తున్న ఒమ్మంగి రహదారి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మండలంలో ఒమ్మంగి గ్రామ ప్రధాన రహదారిపై వాహనాలు , ప్రయాణికులు, పాదచారులు నడిచి వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఈ రోడ్డుమీద ప్రయాణిస్తుంటారు. మెయిన్ రోడ్ ఆంజనేయ స్వామి ఆలయం ఎదురుగా భారీ గుంత ఏర్పడి చెరువుగా దర్శనమిస్తున్నప్పటికీ పంచాయితీ పాలకుల కానీ, పంచాయతీ సిబ్బంది గాని, పట్టించుకోవడం లేదు. ఇటీవల కాలంలో రాత్రి వేళలో భారీ వర్షాలకు ప్రయాణికులు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. రహదారి చెరువు రూపంలో మారడంతో ప్రజలు రహదారిపై ప్రయాణించాలంటే ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్టు ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారిపై రోజు వచ్చే ఆర్టీసీ బస్సులు కూడా ఈ చెరువు రూపంలో ఉన్న రహదారిని దాటుకుని వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. తక్షణమే రహదారికి మరమ్మతులు చేపట్టి గోతులను పూడ్చి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్సి, ఎస్టిలకు డిఎస్సి ఉచిత శిక్షణ

ప్రజాశక్తితో ఇన్‌ఛార్జి జిల్లా ఎస్సి సంక్షేమ అధికారి సందీప్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి



డిఎస్సి రాయనున్న ఎస్సి, ఎస్టి అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఇన్‌ఛార్జి జిల్లా ఎస్సి సంక్షేమ అధికారి సందీప్ తెలిపారు. డిఎస్సి కోసం ఎదురు చూస్తున్న యువతకు ఎట్టకేలకు ఊరట లభించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఎస్సి, ఎస్టి అభ్యర్థులకు ప్రభుత్వం ఉచిత శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంది. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి జిల్లా ఎస్సి సంక్షేమ అధికారిని పలుకరించగా పలు విషయాలను ఆయన ప్రజాశక్తికి వివరించారు.

మూడు నెలల పాటు శిక్షణ

డిఎస్సికి సన్నద్ధమవుతున్న జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభ్యర్థులకు మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నాము. శిక్షణా సమయంలో



ఉచిత వసత, భోజన సదుపాయాలు కల్పించనున్నాం. ఈ అవకాశాన్ని ఎస్సి, ఎస్టి అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి.

నేటితో తుది గడువు

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 11 నుంచే అవకావం కల్పించాం. నేటితో ఈ గడువు ముగుస్తుంది. అభ్యర్థులు http://jnanabhumi.ap.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకోని వారు ఎవరైనా ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలి.

ఎవరు అర్హులు? ఎంపిక ఎలా?

ఎస్‌జిటి శిక్షణకు ఇంటర్మీడియట్‌తో పాటు డైట్ సెట్, టెట్, స్కూల్ అసిస్టెంట్స్ కు డిగ్రీ గ్రాడ్యుయేషన్, బి.ఈడి, టెట్ విద్యార్హతలు కలిగినవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు . అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.2.50లక్షల లోపు ఉండాలి. అర్హత సాధించిన అభ్యర్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పరీక్షను నిర్వహిస్తాం. ఇందులో అర్హత పొందిన వారిని ఉచిత శిక్షణకు ఎంపిక చేస్తాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ఈ నెల 27న అర్హత పరీక్ష

ఉచిత శిక్షణకు అభ్యర్థుల ఎంపిక కోసం ఈ నెల 27న అర్హత పరీక్షను నిర్వహించనున్నాం. ఈ నెల 22 నుంచి 25 వరకూ హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నాం. 27న పరీక్ష నిర్వహించి 28న మెరిట్ లిస్ట్ ప్రకటిస్తాం. 30న జిల్లాల వారీగా ఎంపికైన వారి లిస్టులను ప్రకటిస్తాం. కోచింగ్ సెంటర్ వారీగా అభ్యర్థుల ఎంపికను నవంబర్ 3న నిర్వహిస్తాం. నవంబర్ 6వ తేదీ నుంచి కోచింగ్ క్లాసులను నిర్వహిస్తాం.

పిఆర్ ప్రభుత్వ కళాశాలలో ఆర్థిక అవకతవకలు

విశ్రాంత అధ్యాపకుడు సత్యనారాయణ

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ నగరంలో ప్రసిద్ధి చెందిన పిఆర్ ప్రభుత్వ కళాశాల (అటానమస్)లో పలు ఆర్థిక అవకతవకలు జరుగుతున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించి సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారాన్ని సేకరించానని కాకినాడ జిల్లాకు చెందిన విశ్రాంత అధ్యాపకుడు యు.సత్యనారాయణ తెలిపారు. ఈ వివరాలను ఒక ప్రకటన ద్వారా ఆయన వెల్లడించారు. పిఆర్ కళాశాలలో యుజి, పీజీల్లో పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో విద్యాపరంగా ఎంతో ప్రసిద్ధి చెందిన అగ్రగామి సంస్థల్లో పిఆర్ విద్యాసంస్థలు ఒకటని తెలిపారు. అయితే కళాశాల పరీక్ష విభాగంలో విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజుల రూపంలో వసూలు చేసిన డబ్బులు దుర్వినియోగం అవుతున్నాయని, కొన్ని నిధులు దారిమళ్లుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో విజయవాడ అకౌంటెంట్ జనరల్ ఆఫీసు అధికారులు జరిపిన ఆడిట్‌లోనూ ఈ అవకతవకలు బయట పడినట్లు ఆయన తెలిపారు. పరీక్షల విభాగానికి చెందిన 2022-23 విద్యా సంవత్సరానికి అయిన జమా ఖర్చుల వివరాలను స.హ.చట్టం ద్వారా తీసుకున్నానని తెలిపారు. ఈ ఖర్చుల వివరాలు, గతేడాది సెప్టెంబర్ 1న కళాశాల ప్రిన్సిపల్ అధ్యక్షతన జరిగిన ఆర్థిక సంఘం(ఎఫ్‌సి) సమావేశంలో ప్రిన్సిపల్ సమర్పించిన ఖర్చుల వివరాలతో పోలిస్తే వాటి మధ్య పొంతన లేదన్నారు. ఆర్‌టిఐ ద్వారా తనకు ఇచ్చిన సమాచారంలో జవాబు పత్రాల మూల్యాంకనానికి, పునరమూల్యాంకనానికి రూ.6,07,495 ఖర్చు కాగా ఆర్థిక సంఘం సమావేశంలో మాత్రం రూ.3,78,238 లుగా చూపారని తెలిపారు. రూ.4,92,155 ఎఫ్‌సిలో ఇతర కాలేజీలకు ఇచ్చినట్లుగా చూపితే, పరీక్షల విభాగం సిబ్బంది ఈ విషయాన్నే తెలపకపోవడం గమనార్హం అన్నారు. ఈ ఎఫ్‌సిలో ప్రిన్సిపల్, కొంతమంది లెక్చరర్లతో పాటూ, మరి కొంత మంది పట్టణ ప్రముఖులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజుల రూపంలో వసూలు చేసిన సొమ్ముల్లో కొంత భాగాన్ని కళాశాల సుందరీకరణకు కేటాయించారని, అయితే అక్కడ సుందరీకరణ పనులు నిధుల కేటాయింపులకు అనుగుణంగా లేవన్నారు. రూ.లక్షల్లో దుర్వినియోగం అయ్యాయన్నారు. రూ.లక్ష దాటిన ఏ పనికి అయినా టెండర్లు పిలవాల్సి ఉండగా, ఇక్కడ అలాంటి నిబంధనలు ఏవీ అమలు కాలేదన్నారు. ఈ నేపథ్యంలో కళాశాల ఖర్చుల వివరాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి అవకతవకలకు పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండు చేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సూరిబాబురాజు,రామశాస్త్రి

విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యార్థి దశ నుంచి సైన్స్ ప్రయోగాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెరుగుతుందని మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు అన్నారు. స్థానికబ్రాహ్మణ సేవా సంఘ భవనంలో ఎసిటి సైన్స్ సెంటర్ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ సెంటర్‌ను విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులను అభినందించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా పరిధిలో పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన సైన్స్ ప్రయోగాలు, గణితంలో క్విజ్ పోటీల్లో సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అల్లంరాజు చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ అల్లంరాజు రామశాస్త్రి ఆన్‌లైన్ గణితం పోర్టల్ ను ప్రారంభించారు. సైన్స్ ప్రయోగాలు, గణిత క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రియా కార్యదర్శి జగన్నాథం, చిల్డ్రన్స్ క్లబ్, క్రియా, అల్లంరాజు ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో వాసవి క్లబ్ సేవలు



ప్రతిజ్ఞ చేస్తున్న ఇంటర్నేషనల్ ట్రెజరర్ సూర్య ప్రకాష్ రావు

ప్రజాశక్తి - తాళ్లరేవు రూరల్

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వి.210ఎలో భాగంగా 55 వాసవి క్లబ్‌ల ద్వారా ఈ ఏడాది రూ. 2 కోట్లతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామని జిల్లా గవర్నర్ గోకవరపు విఎన్.సుభాష్ తెలిపారు. ఆదివారం స్థానిక సూర్య భాస్కర కళ్యాణ మండపంలో సుభాష్ అధ్యక్షతన ఎస్.4 సెన్సేషన్ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఉత్తమ క్లబ్‌లకు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ సిద్ధ వెంకట సూర్యప్రకాష్‌రావు బహుమతులను అందజేశారు. రాబోయే రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న వాసవి సభ్యులను గుర్తించి సత్కరించాలని నిర్ణయించారు. పేద ప్రజలకు మరిన్ని సేవలు చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పి.కనకరాజు, కంతేటి కాశి, తాళ్లరేవు వాసవి క్లబ్ అధ్యక్షులు అద్దేపల్లి సుధ, కార్యదర్శి దాసరి భారతి, కోశాధికారి గోకవరపు శ్రీదేవి, పేకేటి సతీష్, అద్దేపల్లి సత్తిరాజు, నున్నా దత్తు, సామ సర్వలక్ష్మి పేకేటి పూర్ణ ,శేషు, కొత్త సుభాష్ పాల్గొన్నారు.

ఇస్మాయిల్‌నగర్ అభివృద్ధి కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట ఇస్మాయిల్ నగర్ అభివృద్ధి కమిటీ ఎన్నికలు ఆదివారం సాయంత్రం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ, యండ్రు సత్యనారాయణ చౌదరి ఆధ్వర్యంలో జరిగాయి. కమిటీ చైర్మన్‌గా పబ్బు వేణుగోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కాటంరెడ్డి ఏడుకొండలు, ట్రెజరర్‌గా దొడ్డా సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ గౌరవ అధ్యక్షురాలిగా యాళ్ల పద్మలత, ఛీఫ్ అడ్వయిజర్‌గా తోటకూర సాయిరామకృష్ణ, ఉపాధ్యక్షులుగా షేక్ జిలానీ, ద్వారంపూడి వెంకటరెడ్డి, కార్యదర్శులుగా పి.దుర్గారావు, వి.అప్పలరాజు, డి.శివశంకర్, తాళ్లూరు వైకుంఠం ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎం.వెంకట్రావు, గడ్డం ఈశ్వరరావు, అడబాల శ్రీనివాసు, ఎస్.రాంబాబు, తేతలి వీర్రాఘవరెడ్డి, రొంగల మహేష్, షేక్ దురాని, జివి.రమణ, బుజ్జి ఎన్నికయ్యారు.



ఇస్మాయిల్ నగర్ అభివృద్ధి కమిటీ సభ్యులు

రాజోలు ప్రభుత్వాసుపత్రికి మహర్దశ

- 100 పడకలకు శ్రీకారం
- రూ.3 కోట్లతో నిర్మాణ పనులు ప్రారంభం
- నేడు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్‌చే శంకుస్థాపన

ప్రజాశక్తి- రాజోలు

రాజోలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వంద పడకల ఆసుపత్రిగా మారనుంది. రాజోలు నియోజకవర్గంలోని 60 గ్రామాలతో పాటు పి.గన్నవరం మండలం, పక్కనున్న పశ్చిమగోదావరి జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు వైద్యం నిమిత్తం రాజోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోజూ వందలాది మంది వస్తారు. నెలకు 40 ప్రసవాలు, ఇతర శస్త్రచికిత్సలు, జ్వరపీడితులు కలిపి 50మంది పైనే ఆసుపత్రిలో ఉంటారు. దీనితో పాటు ప్రతీరోజు సుమారు 200 ఒపిలను డాక్టర్లు పరీక్షిస్తారు. ప్రస్తుతం కమ్యూనిటిహెల్త్ సెంటర్ (సిహెచ్‌సి)గా ఉన్న ఆసుపత్రి రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ చొరవతో సిహెచ్‌సి నుంచి వంద పడకల ఎరియా ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆసుపత్రి అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులతో ఆసుపత్రి రెండవ అంతస్థుతో పాటు కార్పోరెట్ స్థాయిలో ఆసుపత్రి భవన నిర్మాణం ఆకృతి, ఆసుపత్రి సముదాయాలను తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేశారు ఇందులప భాగంగా ఈ నెల 21న సోమవారం ఎంఎల్ఎ చేతులమీదుగా శంకుస్థాపన చేసేందుకు సిద్ధమయ్యారు.



రాజోలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్


చిరకాల కల నెరవేరుతున్న వేలా...!

రాజోలు కమ్యూనిటి హెల్త్ సెంటర్ భవనం నిర్మించి 24 సంవత్సరాలు అవుతోంది. అప్పటి ఎంఎల్ఎ ఎవి.సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు ప్రారంభించారు. అప్పటి నుండి వైద్య సేవలు అందిస్తుంది. రోగుల పరిస్థితి విషమించితే అమలాపురం ఎరియా ఆసుపత్రికి లేదా కాకినాడ జనరల్ ఆసుపత్రికి పంపిస్తుంటారు. దీంతో కొంతకాలంగా ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందకుండా పోయాయి. దీనిపై ఇరవై నాలుగేళ్లుగా ఒక ఎంఎల్ఎ కూడా దృష్టి పెట్టకపోవడం ఆసుపత్రిలో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందేవికావు. ప్రస్తుతం ఎంఎల్ఎ గెలిచిన దేవ వరప్రసాద్ ఎంఎల్‌ఎగా బ్యాతలు చేపట్టినప్పటి నుండి ఆసుపత్రిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ గత నాలుగు నెలలుగా సిబ్బందిని పరుగులు పెట్టిస్తున్నారు. ఇందులో భాగంగానే సెప్టెంబర్ నెలలో ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ను ప్రారంబించి వందలాది డయాలసిస్ రోగులకు ఆసరాగా నిలిచింది. మరలా వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి ఉన్నతాధికారులను ఒప్పించి ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంఎల్ఎ రాజోలు నియోజకవర్గ ప్రజలు పార్టీలకు అతీతంగా ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

పది రకాల వైద్య సేవలు

రాజోలు కమ్యూనిటి హెల్త్ సెంటర్లో జనరల్ మెడిసిన్, ఇఎన్‌టి, ఆప్తాల్మజీ, దంత చికిత్స, ఒబిజిపై, ఆర్థోపెడిక్, ఫిజియోథెరపి, ఇజిజి, ఎక్స్‌రే, అన్ని రక్త పరీక్షలు ఇలా మొత్తం 10 రకాలకు చెందిన అత్యాధునిక వైద్య సేవలందిం చనున్నారు. మహిళలు సంబంధించిన సేవలు సిహెచ్‌సిలో అందిస్తారు.

ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగు పరచాలి



రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపరచాలి. ఎవరికైనా ప్రమాదం జరిగితే ఫస్ట్ ఎయిడ్ స్కేవెంజర్స్‌తో చేయించి, అమలాపుర లేదా కాకినాడకు పంపిస్తున్నారు. కనీసం వైద్య సేవ అందించి మెరుగైనా వైద్యం కోసం వేరే ఆసుపత్రులకు సిరార్సు చేస్తే మేలు కలుగుతుంది.ఆసుపత్రిలో ఐసియూ బెడ్ లను ఏర్పాటు చేయాలి.

– కరుపల్లి గోపాలన్, సిపిఎం రాజోలు శాఖ కార్యదర్శి

100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దితాం



రాజోలు సిహెచ్‌సిని 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతాం. ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని సెకండరీ హెల్త్ సర్వీస్ డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశాము. సిఎస్ఆర్ రూ.3 కోట్ల నిధులతో ఆసుపత్రి అభివృద్ధి పనులను ప్రారంభించి, ప్రస్తుతం ఉన్న భవనానికి పైఅంతస్తు నిర్మాణం, డ్రెయిన్ వ్యవస్థను మెరుగుపరుస్తాం. కార్పొరేట్ స్థాయిలో భవనం ఆకృతి, పార్క్ నిర్మాణం ఉంటుంది. ప్రజలకు మెరుగైనా సేవలు అందేలా కృషి చేస్తాను.

-దేవ వరప్రసాద్ ,ఎంఎల్ఎ రాజోలు



రామస్వామి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న తుమ్మల బాబు

రామస్వామి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని మరలావ మాజీ సర్పంచ్, పెద్దాపురం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గవరసాన రామస్వామి సేవలు మరువలేమని జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు అన్నారు. ఆదివారం రామస్వామి 5వ వర్ధంతి సందర్భంగా గ్రామంలోని ఆయన విగ్రహానికి బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి, గవరసాన దివాకర్, రాజశేఖర్, గొల్లపల్లి శ్రీను, మిరియాల చంటిబాబు, లింగం రాజా, అబ్బిరెడ్డి బుజ్జి పాల్గొన్నారు.



మూర్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మల్లాడి కృష్ణారావు

మాజీ ఎంపిపికి మల్లాడి పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లరేవు రూరల్

మాజీ ఎంపిపి అరదాడి కృష్ణకుమారిని పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆదివారం పరామర్శించారు. ఇటీవల కాలంలోనే ఆమె భర్త ఎఎస్ఆర్.మూర్తి(85) మృతి చెందారు. ఈ నేపథ్యంలోనే ఆయన కుటుంబ సభ్యులను మల్లాడి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ పర్యటనలో మాజీ సర్పంచ్ బర్రె లక్ష్మీ నరసింహరాజు, నాయకులు కామాడి మాతరాజు, వనమాడి నూకరాజు, కొల్లు వీరబాబు, అరదాడి అన్నవరం, అప్పారావు పాల్గొన్నారు.

27న కవి సంధ్య స్వర్ణోత్సవ సభ

ప్రజాశక్తి - యానాం

కవి సంధ్య, కవిత్వ పత్రిక స్థాపించి 50 సంచికలు పూర్తి చేసుకున్న సందర్భంగా అక్టోబర్ 27న యానాం గీతా భవన్‌లో స్వర్ణోత్సవ సభ నిర్వహించనున్నట్లు శికామణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా, స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ, వాడ్రేవు చిన వీర భద్రుడు, పాయల మురళీ కష్ణలకు కవితా పురస్కారాలు, పది మందికి సంధ్య ప్రతిభా పురస్కారాల ప్రదానం, శిఖామణి మలయాళ కవిత్వ గ్రంథావిష్కరణ, కవి సమ్మేళనం ఉంటాయన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - కాకినాడ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ తిరుపాణ్యం అన్నారు. ఆదివారం పిఆర్ కాలేజ్ గ్రౌండ్ యూజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లో 150 వేప మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో గౌండ్ యుజర్స్ అసోసియేషన్ నాయకులు తలాటం హరీష్, డాక్టర్ శ్యామసుందర్ పాల్గొన్నారు. ఆల్ ఇజ్ వెల్ సభ్యులు పిఆర్. కాలేజ్ 4 ఎన్ఎస్ఎస్. యూనిట్స్‌కు చెందిన విద్యార్థులు కాలేజ్ ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించి చెత్తను తొలగించి మొక్కలు నాటారు. ఈసందర్భంగా కాలేజ్ ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, గౌండ్ యుజర్స్ అసోసియేషన్ సెక్రటరీ తలాటం హరీష్, డా.శ్యామసుందర్, డా. సాయిలు మాట్లాడుతూ ఎంతో కష్టపడి వేప మొక్కలు నాటితే వాకింగ్‌కు వచ్చేవారు వేప చిగురులు తెంపి తినడం వల్ల వేసిన మొక్కలు చచ్చిపోతున్నాయన్నారు. కనుక గ్రౌండ్‌కు వచ్చేవారు మొక్కలు తాకకుండా ఉంటే మొక్కలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమంలో పిఆర్. కాలేజ్ గ్రౌండ్ యుజర్స్ అసోసియేషన్ నాయకులు, ఆల్ ఇజ్ వెల్ సభ్యులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థునులు

పశువైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ముద్రగడ

ప్రజాశక్తి - రౌతులపూడి

పశు వైద్యులు సంఘానికి జిల్లా ప్రధాన కార్యదర్శిగా రౌతులపూడి మండల పశు వైద్య శాఖ అధికారి ముద్రగడ వీరరాఘవరావు ఎన్నికయ్యారు. ఆదివారం కాకినాడలో పశువైద్యల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. ముద్రగడ వీర రాఘవరావు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

ఘనంగా వీరపేరంటాలమ్మ జాతర

ప్రజాశక్తి- సామర్లకోట

సామర్లకోట ఇస్మాయిల్ నగర్ వద్ద వీర పేరంటాలమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు కళా రూపాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట యాదవ సంఘం అధ్యక్షుడు నమ్మి శ్రీనివాస్, నాయకులు రాజన తాతారావు, దారబాల అప్పారావు, కె.గోవిందు, పి.ఈశ్వరరావు, దారబాని రమణ, బి.సోమేశ్వరరావు, రాజన్న, శివ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జాతర లో ప్రదర్శనలు చూపర్లను ఆకట్టుకున్నాయి.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ కాకినాడ పట్టణ అశోక్ నగర్ కాపురస్తులైన **చొల్లంగి సూర్యనారాయణ గారి భార్య చొల్లంగి లక్ష్మీకాంతం గారు** నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మంది ప్రజానీకానికి తెలియచేయునది ఏమనగా,

నా క్లయింట్ గారి దాంపత్య కాలంలో ఆమెకు ఇద్దరు మగవారు మరియు ఇద్దరు ఆడవారు సంతానం. అందలి ఆమె చిన్న కుమారుడైన చొల్లంగి శ్రీనివాస్, పెళ్లి అయిన నాటి నుండి తప్పుడు ప్రలోభాలకు లోనై, దాంపత్య జీవితం కూడా సరిగ్గా చేయక అతని భార్యకు విడాకులు ఇచ్చి ఉన్నాడు. తదుపరి అతను వేరొక వివాహం చేసుకోకుండా నా క్లయింట్ వద్దనే ఉంటూ ఆమె నుండి డబ్బులు తీసుకెళ్లడమే కాకుండా నా క్లయింట్‌ని వారి తాలూకు మిగతా కుటుంబ సభ్యులు ఎవరికీ కానీ సంబంధం లేకుండా, వారి పేర బయట వ్యక్తుల నుండి డబ్బులు వసూలు చేయుచున్నాడని తెలియ వచ్చినది. కావున చొల్లంగి శ్రీనివాస్ చేసే ఎటువంటి లావాదేవీలకు నా క్లయింట్ అయిన చొల్లంగి లక్ష్మీకాంతం గానీ, వారి మిగిలిన కుటుంబ సభ్యులు గానీ ఎటువంటి సంబంధం లేదని, అవి వారిపై బైండు చేయజాలవని ఇందుమూలంగా అందరికీ తెలియజేయడమైనది.

S.MURTUJA
Kakinada Advocate, Kakinada
Dt: 20-10-2024 Cell: 9652538888